క్లుప్తంగా

ముగిసిన ఎస్సెస్సీ పరీక్షలు

దమ్మపేట: ఇటీవల ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు బుధవారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన సాంఘిక శాస్త్రం పరీక్ష మధ్యాహ్నం 12:30కు ముగిసింది. దీంతో పరీక్ష కేంద్రాల నుంచి విద్యార్థులు ఒక్కసారిగా ఆనందోత్సాహాలతో కేరింతలు కొడుతూ బయటకు వచ్చారు.

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలో పదో తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. గడిచిన నెల మార్చి 21వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమైన విషయం విదితమే. మండలంలోని అన్నపురెడ్డిపల్లి, ఎర్రగుంట, రాజాపురం గ్రామాల్లో ఉన్న పాఠశాలల 303 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ ఆనంద్‌కుమార్ తెలిపారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని మర్రిగూడెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవన సముదాయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పర్సా వెంకట్, వీరబోయిన నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఐటీయూ జాతీయ కమిటీ సభ్యుడిగా సుమన్



మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జాతీయ కమిటీ సభ్యుడిగా ముత్యాల సుమన్‌ను జాతీయ మహాసభ ఎన్నుకుంది. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచి పట్టణంలో 11వ జాతీయ మహాసభలు జరగ్గా నూతన కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బుధవారం తెలిపారు. సుమన్ జీఎం కార్యాలయంలో అకౌంట్ సెక్షన్‌లో పనిచేస్తుండటంతో జీఎం కార్యాలయ వర్గాలు, సీఐటీయూ యూనియన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

నూతన కమిటీని ఏర్పాటు చేయాలి

మణుగూరుటౌన్: పద్మగూడెం, కొత్తకొండాపురం, కొమ్ముగూడెం గ్రామాల ఇసుక సొసైటీని ఐదుగురు సభ్యులే ఏడు సంవత్సరాలుగా నడుపుతూ.. ఊరికి అన్యాయం చేస్తున్నారని, ఆ ఇసుక కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని ఎన్నుకోవాలని సొసైటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మూడు గ్రామాల్లో ఏడు సంవత్సరాల క్రితం 142 మంది సభ్యులతో సొసైటీని ఏర్పాటు చేశారన్నారు. అందులో రెండు గ్రామాలకు చెందిన ఐదుగురు వ్యక్తులే మొత్తంగా చెప్పుకుంటూ అక్రమాలకు, అవకతవకలకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయమై ప్రశ్నిస్తే బెదిరిస్తున్నట్లు వాపోయారు. ఇకపై నూతన ఇసుక సొసైటీ కమిటీని ఏర్పాటు చేసిన తర్వాతే ఇసుకను తీయాలని, లేకుంటే చూస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు.

అంబేడ్కర్ సంఘం ఎన్నిక

బూర్గంపాడు: సారపాకలోని గాంధీనగర్, రాజీవ్‌నగర్, విజయనగర్ కాలనీల ఉమ్మడి అంబేడ్కర్ సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గాంధీనగర్‌లో ఇస్రం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీ కన్వీనర్‌గా ఇరుగు ఈశ్వరరావు, కోకన్వీనర్‌లుగా కేసుపాక నర్సింహారావు, తుమ్మల కిరణ్, ప్రధాన కార్యదర్శిగా ఇస్రం శ్రీను, వలదాసు సాలయ్య, కార్యదర్శులుగా రావులపల్లి ఈశ్వరయ్య, సూదిపాక పున్నం, ఇల్లంగి లాలయ్య, రేపూరి ఈశ్వర్, గార్లపాటి శంకర్‌లను ఎన్నుకున్నారు.

'మోసపూరిత వాగ్దానాలు బీఆర్‌ఎస్‌వే'

దుమ్ముగూడెం: ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు ఇచ్చింది గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ అన్నారు. బుధవారం లక్ష్మీనగరం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పి ఎన్నో వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన గత బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాపాలన అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలపై కేసులు నమోదు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మండల కాంగ్రెస్ నాయకులు లంక శ్రీనివాసరావు, పిలక వెంకటరమణారెడ్డి,జిరి సత్యనారాయణ, గడ్డం బాలాజీ, కోడి చంటి, ఎర్ర శంకర్, అయపు రెడ్డి శ్రీధర్, కొండపల్లి నరేంద్ర, అల్లాడి వెంకటేష్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామ శివారులో ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు బుధవారం లెక్కించారు. ఈ ఏడాది మార్చి 5వ తేదీ నుంచి ఏప్రియల్ 2వ తేదీ వరకు రూ.1,05,274 రూపాయాల ఆదాయం సమకూరినట్లు ఆ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి.బెయిల్ సింగ్ తెలిపారు. ఆలయ ఈఓ బి.సూర్య ప్రకాష్, ఆలయ చైర్మన్ నరాల శ్రీనివాస్, ధర్మకర్త మండలి సభ్యులు ఆలపాటి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భద్రాద్రి దిశగా అడుగులు



భద్రాచలం పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న డ్రెయినేజీ..



హానికర చెత్తను డంప్ చేసేందుకు లీజుకు తీసుకున్న స్థలం

- హానికర చెత్త సేకరణకు మరో డంపింగ్ యార్డ్
- నూతన మరుగుదొడ్ల నిర్మాణం
- రూ.3 కోట్లతో సోలార్ వ్యవస్థకు ప్రణాళికలు

భద్రాచలంఅర్బన్: భద్రాచల పట్టణాన్ని స్వచ్ఛ భద్రాద్రి చేసేందుకు గాను గ్రామ పంచాయతీ అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే భద్రాచలం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ.1.80 కోట్లతో తడి చెత్త, పొడి చెత్త సేకరణకు గాను డీఆర్‌సీసీ నిర్మాణం పూర్తి కాగా.. గత నెల 23న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదగా ఆ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొని వచ్చారు. కాగా గ్రామ పంచాయతీ అధికారులు మరో ముందడుగు వేశారు. చెత్తలో హానీకరమైన చెత్తను వేరు చేసి వాటిని నిల్వ చేసేందుకు గాను నూతన కరకట్ట వద్ద ఆరు ఎకరాల స్థలాన్ని లీజ్‌కు తీసుకుఅన్నరు. ఇప్పటికే ఆ ప్రదేశంలో గుంతలు తవ్వి ఈ చెత్తను అక్కడ పూడ్చి పెట్టే ప్రక్రియను ప్రారంభించారు.

సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు

భద్రాచలం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన డీఆర్‌సీసీలో యంత్రాలు నిర్వహణకు నిత్యం విద్యుత్ అవసరం కాగా.. జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఆలోచనతో సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో 600కిలోవాట్స్ సోలార్ వ్యవస్థను ఏర్పాటుకు చేయనున్నారు. ఇందుకుగాను గ్రామ పంచాయతీ సొంత నిధుల నుంచి రూ.90లక్షలు చెల్లిస్తుండగా, మిగిలిన రూ. 2.10 కోట్లు బ్యాంక్ నుంచి అప్పుగా (లోన్) తీసుకోనున్నారు. దీని మూలంగా విద్యుత్‌కు ప్రస్తుతం పెడుతున్న ఖర్చులో రూ.24 లక్షలకు పైగా పంచాయతీకి మిగలనుంది. కలెక్టర్ ఆదేశాలతో పీఓ రాహుల్ దృష్టి సరించగా, పంచాయతీ ఈఓ శ్రీనివాస్ రావు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.

మరుగుదొడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం..

భద్రాచలం పట్టణంలో ఇప్పటికే 138 శాశ్వత మరుగుదొడ్లు ఉండగా వీటికి అదనంగా సులభ్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో మరో రెండు మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. వీటి నుంచి ఏడాదికి రూ.36 వేలు ఆదాయం రానుంది. శ్రీరామనవమి వేడుకలకు గాను అధికారులు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో 140 తాత్కాలిక మరుగదొడ్లు ఏర్పాటు చేస్తుండగా.. 28 ప్రాంతాల్లో భక్తులకు తాగునీటిని ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా భద్రాచలం పట్టణంలో మొత్తం రూ.3 కోట్లతో చర్ల రోడ్డులో డ్రెయినేజ్ నిర్మాణంతో పాటుగా పట్టణంలోని రాజుపేట, యమునాలనగర్, శాంతి నగర్, సుభాష్ నగర్, ఏఎంసీ కాలనీలలో సీసీ రోడ్లను నిర్మిస్తున్నారు.

ఐటీసీ తోడ్పాటు..

భద్రాచలం గ్రామ పంచాయతీ పరిధిలోని కరకట్ట మీద ఉన్న ఐరన్ గ్రిల్స్ పాడైయిపోయిన పరిస్థితికి రాగా.. మొదటి విడతలో ఐటీసీ సీఎస్ఆర్ ఫండ్‌తో రూ.25లక్షలతో ఐరన్ గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. కాగా ఇటీవల రెండో విడతలో భాగంగా మరో రూ.25లక్షలతో ఐరన్ గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా పట్టణంలోని కూనవరం రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల కోసం రూ.30 లక్షలతో అత్యాధునిక మరుడుదొడ్లు నిర్మిస్తుండగా.. రూ.30లక్షలతో మరో మూడు ప్రాంతాల్లో మరుగుదొడ్లను ఏర్పాటు చేయనున్నారు. ఇలా మొత్తంగా ఐటీసీ తన సీఎస్ఆర్ ఫండ్ నుంచి భద్రాచలం అభివృద్ధికి రూ.1.10 కోట్లు ఖర్చు చేస్తోంది.



డిగ్రీ కళాశాలలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు

అభివృద్ధే ధ్యేయం..



భద్రాచలం అభివృద్ధే ధ్యేయంతో ముందుకు వెళ్తున్నాం. దీనిలో భాగంగా ఇప్పటికే తడి చెత్తను వేరు చేసే విధంగా డీఆర్‌సీసీని ఏర్పాటు చేసుకున్నాం. రానున్న కాలంలో పట్టణ ప్రజలకు చెత్త సమస్య లేకుండా చేయడమే లక్ష్యం. ప్రజల అవసరాల రీత్యా ప్రజా మరుగుదొడ్లు, కాలనీలలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మిస్తున్నాం. కాలనీల్లో ఏమైనా సమస్యలుంటే గ్రామ పంచాయతీలో సంప్రదించి, పరిష్కరించుకోవాలి.

– శ్రీనివాసరావు,
గ్రామ పంచాయతీ ఈఓ, భద్రాచలం

రాజ్యాంగ వ్యతిరేక విధానాలను వివరించాలి



మణుగూరుటౌన్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్: బీజేపీ రాజ్యాంగ విరుద్ధంగా చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని, రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అనే నినాదం ప్రతి ఇంటికీ చేరే విధంగా చూడాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు సూచించారు. బుధవారం ఆయన అంబేడ్కర్ చౌరస్తాల్లోని అంబేడ్కర్ చిత్రపటానికి ర్యాలీగా వెళ్లి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మరోవైపు, కూనవరం పంచాయతీలోని రూ.50లక్షల అంచనా వ్యయంతో ఐదు సీసీ రోడ్లు, ఐదు డ్రోమినేజీలతో పాటు, స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రూ.15లక్షలతో గ్రావెల్ లెవలింగ్ పనులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కొండాయిగూడెంలోని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆవుల సర్వేశ్వరరావు తల్లి పుల్లమ్మ దశదినకర్మలకు హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల కో–ఆర్డినేటర్ ఏలూరు కోటేశ్వరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్, పట్టణ అధ్యక్షుడు శివ, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, సౌజన్య, సామా శ్రీనివాసరెడ్డి, కూచిపూడి బాబు, అబ్దుల్లా, కుర్రం రవి, సతీష్, గాండ్ల సురేశ్, నాయకులు, సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

పినపాక: మండలంలో బుధవారం పర్యటించిన ఎమ్మెల్యే పాయం.. భూపాలపట్నం గ్రామంలో పేదలకు అందిస్తున్న సన్నబియ్యాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వారికి సన్నబియ్యం స్వయంగా అందించారు. అనంతరం భూపాలపట్నం గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో సునీల్, మండల అధ్యక్షుడు రామనాథం, తదితర నాయకులు పాల్గొన్నారు.

భద్రాద్రి అభివృద్ధిపై సీఎం ప్రకటన చేయాలి



దీక్షలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్

భద్రాచలంఅర్బన్: శ్రీరామనవమికి భద్రాచలం వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు భద్రాచలం అభివృద్ధిపై స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజీ రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ రామలింగేశ్వరరావుతో కలిసి ఏజీ రమేష్ ప్రారంభించి మాట్లాడారు. పోలవరం బ్యాక్ వాటర్‌తో భద్రాచలం ముంపు, భద్రాచలంకు చుట్టూ ఉన్న ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపడం తదితర అంశాలపై సీఎం స్పందించి, పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. రామాలయం అభివృద్ధితోపాటు భద్రాచలం పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, కరకట్ట ఇరువైపులా ఎత్తు పెంచాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, సున్నం గంగ, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు పి.సంతోష్ కుమార్, డి.సీతాలక్ష్మి, పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, యు.జ్యోతి, ఎస్‌డి.ఫిరోజ్, జీవనజ్యోతి, చాట్ల శ్రీనివాస్, ఎస్.భూపేంద్ర పాల్గొన్నారు.

యూనివర్సిటీ భూములు విక్రయించొద్దు

హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీని విక్రయించవద్దని, దీనిపై నిరసన వ్యక్తం చేసి అరెస్టైన విద్యార్థి సంఘాల నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. స్థానికంగా సీపీఎం నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. రహదారులపై నిరసనలు చేసి.. సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో ప్రభుత్వ భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని, అలా అమ్మితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

– సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: నిరసన చేపట్టిన సీపీఎం శ్రేణులు



ములకలపల్లిలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు



బూర్గంపాడు: ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ఉచితంగా దరఖాస్తులు

అశ్వాపురం: ముస్లిం మైనార్టీలకు రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తును ముస్లిం మైనార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రుబీనా ఆన్‌లైన్ సెంటర్‌లో ఉచితంగా చేయనున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు ఎస్‌కె.ఖదీర్ తెలిపారు. అశ్వాపురంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉచిత దరఖాస్తుల అవకాశాన్ని మండలంలోని ముస్లిం యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ముస్లీం మైనార్టీ మండల కమిటీ నాయకులు ఎండీ.రఫీఖాన్, ఎస్‌డి.హబీబ్, ఎండి.అమర్, ఎస్‌కె.అబ్దుల్‌రహీం, ఎస్‌కె.అన్సారీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో సెయింట్‌జోసఫ్ స్కూల్ ఎదురుగా బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మద్దుకూరు గ్రామానికి చెందిన యువకుడు నల్లమోతు శ్రీకాంత్‌కు గాయాలయ్యాయి. తల్లి వాణి అనారోగ్య నేపథ్యంలో అందిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును చంద్రుగొండలోని ఓ బ్యాంకులో జమ చేసి తిరిగి వెళ్తుండగా.. ఎదురుగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకుంది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌కు చేయి వేళ్ళు, రెండోచేయి, గూడ తొలగడంతోపాటు కాలుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడు కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వితరణ..

అశ్వారావుపేట: భద్రాచలం రామాలయానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులకు బుధవారం అశ్వారావు పేటలో ఆహారం, మజ్జిగ పంపిణీ చేశారు. జంగారెడ్డిగూడెం రోడ్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సర్వాయి పాపన్న గౌడ్ సంఘం ఆధ్వర్యంలో గౌడ బజారులో మజ్జిగ పంపిణీ చేశారు.

ఏబీపీఎంకు సన్మానం

చంద్రుగొండ: మండలంలోని పోకలగూడెం గ్రామంలో ఉద్యోగ విరమణ చేసిన తపాల శాఖ ఏబీపీఎం తంగెళ్ళపల్లి సత్యనారాయణను బుధవారం తోటి ఉద్యోగులు సన్మానించారు. శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తపాలశాఖ కొత్తగూడెం డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండ్ రంజిత్ కుమార్ చౌహాన్, తపాలశాఖ ఉద్యోగులు శ్రీనివాసరావు, గిరిశంకర్, మణికుమార్, సిబ్బంది వెంకటేశ్వరరావు, గణేష్, బాలగణేష్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఆంజనేయుడి ఊరేగింపు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారంవారిగూడెం గ్రామంలో బుధవారం అభయాంజనేయ స్వామి వారి విగ్రహాన్ని ఊరేగించారు. గ్రామంలో నూతనంగా నిర్మించి ఆలయంలో స్వామి వారి విగ్రహాన్ని గురువారం ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద గడిచిన రెండు రోజులుగా అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, వివిధ రకాల హోమాలు, అభిషేకాలు చేస్తున్నారు. భక్తులంతా హాజరై విజయవంతం చేయాలని ఆలయ కమిటీ బాధ్యులు కోరారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ఎలుగుబంటి దాడి బాధితులకు పరిహారం చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే జారే

చంద్రుగొండ: పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా రాష్ట్రంలో ప్రజాపాలనను కాంగ్రెస్‌పార్టీ కొనసాగిస్తోందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. తిప్పనపల్లి, చంద్రుగొండ గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బెండాలపాడు రెండో విడతగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి శంకుస్థాపనలు చేశారు. తుంగారంలో మంగయ్య అనే వ్యక్తికి మంజూరైన రూ.3.50 లక్షల ఎల్‌ఓసీని కుటుంబసభ్యులకు అందించారు. లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఏడాది క్రితం గ్రామాల్లో ఎలుగుబంటి దాడిలో గాయపడిన బాధితులకు సైతం పరిహారం చెక్కులను ఎమ్మెల్యే అందించారు. పంపిణీ కార్యక్రమంలో రేంజర్ ఎల్లయ్య, వివిధ శాఖల అధికారులతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు భోజ్యానాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, కిరణ్‌రెడ్డి, గుగులోతు బాబు, దారం గోవిందరెడ్డి, ఎండి.ఇమ్రాన్, ఎస్డీ సైదా, ఎస్డీ రసూల్, ధారావత్ రామారావు, మచ్చా కుమార్, బడుగు శంకర్, బడుగు కృష్ణవేణి, రుక్మిణి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి



ఎర్రగుంట గ్రామంలో ఆదివాసీలతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

పినపాక: వలస ఆదివాసీ యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు బానిస కావొద్దని ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని ఎర్రగుంట, పిట్టతోగు ఆదివాసి గ్రామాల్లో పర్యటించిన ఆయన.. గ్రామస్తులతో ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లోకి చొరబడితే సమాచారం అందించాలని అన్నారు. యువత విద్య, క్రీడల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఎస్ఐ రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు రైతుల కృతజ్ఞతలు



మాట్లాడుతున్న రామచంద్రప్రసాద్

అశ్వారావుపేట: దిగుమతి సుంకం పెంచడం ద్వారా ఆయిల్‌పాం గెలల ధర పెంపునకు కృషి చేసిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆయిల్‌పాం రైతులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం స్థానిక ఆయిల్‌పాం ఫ్యాక్టరీలో విలేకరుల సమావేశంలో ఆయిల్‌పాం రైతు సంఘం అధ్యక్షులు ఆలపాటి రామచంద్రప్రసాద్ మాట్లాడారు. 2020 మార్చి నుంచి 2025 మార్చి వరకు ఆయిల్‌పాం రైతులకు పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ బిల్లులను చెల్లించాలని తాను మంత్రి దృష్టికి తీసుకువెళ్లగానే అధికారులతో మాట్లాడి బిల్లులను మంజూరు చేయించారన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని, కేంద్ర ప్రభుత్వంతో మంత్రి చర్చించి దిగుమతి సుంకం పెంచడం వల్లనే నేడు ఆయిల్‌పాం గెలలు టన్నుకు రూ.21 వేలు ధర నిర్ణయించారని తెలిపారు. అనంతరం ఏపీ ఆయిల్‌పాం రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బొబ్బర వీరరాఘవరావు మాట్లాడారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో పామాయిల్ ధర సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లగా రికవరీతో సంబంధం లేకుండా తెలంగాణ ధరను ఇస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకుని ఐదేళ్లు అమలు చేశారన్నారు. సమావేశంలో రైతులు కోటగిరి సీతారామస్వామి, శీమకుర్తి వెంకటేశ్వరరావు, మొగళ్లపు చెన్నకేశవరావు, కృష్ణ, ఏపీ నుంచి వంకినేని రంగారావు, గడ్డమణుగు సత్యనారాయణ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ



అశ్వాపురం: సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలోని రేషన్‌షాపులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూము వీరరాఘవులు, బచ్చు వెంకటరమణ, ఆవుల రవి, రాగం మల్లయ్య, మానాది వెంకన్న, బారాజు సంపత్, దేవంగి వెంకటరమణ, సామకూరి వెంకన్న, గుర్రం చెన్నయ్య, కమటం మనోజ్, రేషన్ డీలర్ తులసి రజిత తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండల పరిధిలోని జగన్నాథపురంలో సన్నబియ్యం పథకాన్ని పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజిలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గాడి తిరుపతిరెడ్డి, శనగపాటి రవి. కొప్పుల రాంబాబు, కృష్ణ, మరీదు నాగు, సురభి రాజేశ్, కుంజా వినోద్, కొలూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీసీ గేటు వద్ద ఏఐటీయూసీ నిరసన



ఐటీసీ గేటు వద్ద నిరసన చేపడుతున్న ఏఐటీయూసీ నాయకులు

బూర్గంపాడు: కార్మికులకు షరతులు లేకుండా స్కిల్ మాట్రిక్స్‌ను వర్తింపజేయాలని ఐటీసీ పీఎస్‌పీడీ గేటు వద్ద బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. యూనియన్ నాయకులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డ్స్‌తో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయుసీ ప్రధాన కార్యదర్శి సింగంనేని ప్రసాద్ మాట్లాడుతూ.. కార్మికుల పట్ల యాజమాన్యం మొండివైఖరితో వ్యవహరిస్తుందని ఆరోపించారు. కార్మికులంతా స్కిల్ మాట్రిక్స్ అమలుకు ఐక్యంగా కలిసి పోరాడాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తన్నీరు వెంకటేశ్వర్లు, బల్లెం నాగేంద్ర, షేక్ జహుర్, రాయల్ నవీన్, స్వామిగౌడ్, కోటమర్తి శ్రీను, ఉపేందర్, అనిల్‌శర్మ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



దుమ్ముగూడెం: నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు



దమ్మపేట: వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

దుమ్ముగూడెం: పంచాయతీలలో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఈ చానెల్ ద్వారా 1వ తేదీన జీతాలు చెల్లించాలని మండలం గ్రామపంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మండల పంచాయతీ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. అర్హత కలిగిన వారికి గ్రామపంచాయతీ సహాయ కార్యదర్శిగా నామకరణం చేసి పర్మినెంట్ చేయాలని, బీమా సౌకర్యం కల్పించి కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

చర్ల: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో భాగంగా మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఈ నెల 19 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు పేర్కొంటూ మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్‌యూనియన్, సీఐటీయూ మండల కార్యదర్శి కల్యాణ్ మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు విజయ్, నరసింహారావు, త్రిమూర్తులు, రమేష్, ప్రసాద్, సంతోషమ్మ, వజ్రం పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

దమ్మపేట: నారాయణపేట్‌లో ఏప్రిల్ 5న నిర్వహించనున్న గ్రామ పంచాయతీ కార్మికుల రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్లను తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పందూరి వీరబాబు, కొలూరి పద్మ, గంగాధర రాఘవులు, నాగరాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.